www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 14 జూన్ 2023

ఆహారంలో నాణ్యత పాటించాలి

హోటల్లో తనిఖీ చేస్తున్న అధికారి

రాయచోటి టౌన్ : హోటల్ యజమానులు ఆహార తయారీ విషయంలో నాణ్యత పాటించాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి డాక్టర్ షమీమ్‌బాష పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని పలు హోటళ్లను తనిఖీ చేశారు. కల్తీ పదార్థాలు వినియోగిస్తున్నారని వినియోగదారుల హక్కుల ఫోరం గత వారంలో జెసికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా అధికారి తనిఖీలు నిర్వహించారు. బస్టాండ్ సమీపంలోని హోటల్లో తనిఖీలు చేసి ఆహార పదార్థాలను శాంపుల్ తీసుకున్నారు. హోటల్‌లో పని చేసే పనిచేసే వారికి సూచనలు చేశారు. ఆహార తయారీ నాణ్యతలో రాజీ పడే ప్రసక్తే లేదని అన్నారు. నాణ్యత ప్రమాణాలు పరిశుభ్రత పాటించని హోటళ్లపై తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎవరైనా నాణ్యత లేకుండా అపరిశుభ్రంగా ఉంటే తమకు తెలియజేయాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని హోటళ్లపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు.

ప్రతి హామీని అమలు చేస్తాం

పాదయాత్రలో నారా లోకేష్ కడప జిల్లాలో ముగిసిన పాదయాత్ర

ఫ్లెక్సీ వద్ద సెల్ఫీ ఛాలెంజ్ చేస్తున్న నారా లోకేష్

ప్రజాశక్తి-గోపవరం

గతంలో రాయలసీమను అభివృద్ధి చేసింది తామేనని, మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే మిషన్ రాయలసీమలో భాగంగా ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకుంటామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 125 రోజుకు చేరుకుంది. మంగళవారం బద్వేలు నియోజకవర్గం గోపవరం మండలంలోని పిపి కుంట విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభమైంది. బద్వేలు ఫారెస్ట్ రేంజి-1లో యువత, రేంజి-2లో మహిళలు, రేంజి-3లో రైతులతో సమావేశాలు నిర్వహించారు. అనంతరం నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలోకి పాదయాత్ర ప్రవేశించింది. పాదయాత్ర సందర్భంగా పలు చోట్ల లోకేష్ మాట్లాడారు. బద్వేలు క్యాంప్ సైట్ బయట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల ముందు సెల్ఫీలు దిగి వైసిపికి ఛాలెంజ్ చేశారు. రాయలసీమకు ఎవరి హయాంలో మేలు జరిగిందో చర్చకు మేము సిద్ధం అంటూ సవాల్ విసిరారు. నాలుగేళ్లలో జగన్, వైసిపికి చెందిన 49 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలు సీమకు చేసింది ఏమీ లేదన్నారు. ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదని, ఒక్క పరిశ్రమ తీసుకురాలేదని విమర్శించారు. క్యాంప్ సైట్ ముందు టిడిపి హయాంలో పూర్తి చేసిన ప్రాజెక్టులు, సీమకు వచ్చిన కంపెనీల లిస్ట్ ప్రదర్శిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. తాము చేసింది ఎంటో చూపించాం, మీరు చేసింది ఎంటో చెప్పే దమ్ము ఉందా అంటూ జగన్‌కి లోకేష్ సవాల్ విసిరారు. రాష్ట్రంలో నాలుగేళ్ల అరాచకపాలనలో బాధితులుగా మారిన ప్రజలకు భరోసా కల్పించడమే లక్ష్యంగా తాను చేపట్టిన యువగళం పాదయాత్ర తొలి మజిలీని మీ అందరి ఆశీస్సులతో విజయవంతంగా పూర్తి చేయగలిగానని పేర్కొన్నారు. 124 రోజుల పాటు నిర్వహించిన సుదీర్ఘ పాదయాత్రలో నాతోపాటు యువగళం బందాలను కంటికి రెక్కలా కాపాడుకుంటూ రాయలసీమ ప్రజలు మాపై చూపిన ఆదరాభిమానాలను జీవితంలో మరువలేనని పేర్కొన్నారు. అడుగడుగునా సీమ ప్రజల కష్టాలను నేరుగా చూశాక తీవ్ర మనోవేదనకు గురయ్యానని తెలిపారు. రాయలసీమ బిడ్డగా ఈ ప్రాంతంలో నెలకొన్న సాగు, తాగునీరు, నిరుద్యోగం, వలసల నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మిషన్ రాయలసీమ ద్వారా మీ కన్నీళ్లు తుడిచి రుణం తీర్చుకుంటానని యువగళం సాక్షిగా మాట ఇస్తున్నాను. ఎంతటి గడ్డు పరిస్థితుల్లోనైనా ప్రత్యర్థులకు ఎదురొడ్డి నిలబడే పోరాట స్ఫూర్తిని మీ నుంచి పొందిన నేను లక్ష్యాన్ని చేరుకునేవరకు విశ్రమించబోనని పేర్కొన్నారు.

ముగిసిన లోకేష్ యువగళం పాదయాత్ర

యువగళం పేరుతో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర కడప జిల్లాలో విజయవంతంగా పూర్తిచేసింది. ఉమ్మడి కడప జిల్లాలో 16 రోజులు 200 కిలోమీటర్ల. మేర కొనసాగింది. గోపవరం మండలంలోని పిపి కుంట వద్ద లోకేష్‌కి రాయలసీమ టిడిపి నాయకులు వీడ్కోలు పలికారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోకి లోకేష్ పాదయాత్ర ప్రవేశించిన సందర్భంగా ఆ జిల్లా నాయకులు ఘన స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో నాయకులు బీద రవిచంద్ర యాదవ్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, బొల్లినేని వెంకట రామారావు, కంభం విజయరామిరెడ్డి, కురుగోండ్ల రామకృష్ణ, కోమ్మి లక్ష్మయ్య నాయుడు, ఆనం వెంకట రమణారెడ్డి, తాళ్లపాక రమేష్ రెడ్డి, కాకర్ల సురేష్, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, పనబాక కృష్ణయ్య, కోటంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, మాలే పాటి సుబ్బనాయుడు, తాళ్లపాక అనురాధ, ఆనం రంగమయూర్‌రెడ్డి ఉన్నారు.

నిర్వాసితులకు భూపరిహారం త్వరగా ఇవ్వాలి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

కడప-రేణిగుంట జాతీయ రహదారి-716 కు సంబంధించి నిర్వాసితులకు భూపరిహారం చెల్లింపులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష పి.ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టోరేట్లో కడప - రేణిగుంట జాతీయ రహదారి 716 నిర్వాసితులకు భూ పరిహారం పంపిణీ అంశంపై జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌తో కలిసి తహశీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూఎన్ హెచ్ 716కు సంబంధించి మొత్తం 692.5 ఎకరాలు సేకరించామన్నారు. ఇందులో ఇప్పటివరకు 1470 మంది నిర్వాసితులకు రూ.63.42 కోట్లు చెల్లించారన్నారు. ఇంకనూ 585 మందికి దాదాపు రూ.31 కోట్లు చెల్లింపులు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఇందులో జిల్లాకు సంబంధించి రాజంపేట, నందలూరు, పుల్లంపేట, రైల్వే కోడూరు, ఓబులవారిపల్లిలలో మండలాల వారీగా ఎన్ని ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయి, ఎంత చెల్లింపులు చేయాల్సి ఉందన్న అంశంలో ఆయా తహశీల్దార్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే రెండు వారాల్లోగా 80 శాతం మేర చెల్లింపులు పూర్తి చేయాలని ఆదేశించారు. భూములకు సంబంధించి కోర్టులో కేసులుంటే ఆ సర్వే నంబర్లకు సంబంధించిన డబ్బు కోర్టులో డిపాజిట్ చేయాలని సూచించారు. సేకరించిన భూమిలో ఏవైనా స్ట్రక్చర్స్ ఉంటే వాటిని గుర్తించి త్వరితగతిన ఫైనలైజ్ చేయాలని ఎన్‌హెచ్ అధికారులను ఆదేశించారు. రైల్వే , అటవీ పోరంబోకు భూముల విషయంలో మార్గదర్శకాలను పక్కగా పాటించాలన్నారు. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన స్ట్రక్చర్స్ ఉంటే ఆ వివరాలను కలెక్టరేట్ కు పంపాలని తహశీల్దార్ల సూచించారు. ఏ అవార్డుకు ఎంత నగదు చెల్లింపు చేశారన్న వివరాలను పక్కగా నమోదు చేయాలన్నారు. జెడ్‌హెచ్‌డిసి భూములకు సంబంధించి మార్గదర్శకాలను పక్కాగా పాటించాలన్నారు. సబ్ డివిజన్ చేసి ప్రొసిడింగ్స్ ఇవ్వాలని పేర్కొన్నారు. వాగులు, వంకలకు సంబంధించి సంబంధిత శాఖ నుంచి ఎన్‌ఓసి తీసుకోవాలన్నారు. పరిహారం సొమ్మును త్వరితగతిన చెల్లింపు చేసి ఎన్‌హెచ్ 716 జాతీయ రహదారి నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో డిఆర్ఒ సత్యనారాయణ, ఎన్ హెచ్ డిప్యూటీ మేనేజర్ వెంకటరమణ, రాజంపేట డివిజన్ తహశీల్దార్లు పాల్గొన్నారు.

అందరికీ విద్య ప్రభుత్వ లక్ష్యం : 'చింతల'

విద్యార్థులకు జెవికె కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పేద విద్యార్థులందరూ ఉన్నత స్థితికి చేరాలనే ధ్యేయంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విద్యా కానుక పథకానికి శ్రీకారం చుట్టారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పిల్లలు క్రమ శిక్షణను అలవర్చుకోవాలని, తల్లిదండ్రులు, గురువులు, పెద్దలను గౌరవించడం అలవాటు చేసుకోవాలన్నారు. నైతిక విలు వలను పెంపొందించుకోవాలని, నైతిక విలువలతోనే వ్యక్తిత్వ వికాసం సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరి తలరాతను మార్చేది విద్యేనని, చదువులో పోటీతత్వాన్ని అలవర్చుకొని ఉత్తమ శ్రేణి ఫలితాలను సాధించినప్పుడే లక్ష్యాలను చేరుకోగలరన్నారు. అనంతరం రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాడు నేడు పథకంతో విద్యా సంస్థల రూపురేఖలు మారిపోయాయని, ఆధునిక సాంకేతికతో కూడిన విద్య పేదలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించినప్పుడే సిఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలకు, ప్రభుత్వ ఆశయానికి సార్థకత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగులమ్మ, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, వైసిపి నాయకులు చింతల వివేకానంద రెడ్డి, రవి నాయక్, అబ్దుల్ కలీమ్, నీళ్ల భాస్కర్, రాయుడు, రిజ్వానుల్లా, మదనమోహన్ రెడ్డి, రఘు, ఎంఇఒ వెంకటరత్నం, హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న విద్యా కానుక పంపిణీ మంగళవారం నెహ్రూ మున్సిపల్ స్కూల్‌లో 23వ వార్డు కౌన్సిలర్ గిరిజసాయిశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ మాట్లాడారు ఒక్కో విద్యార్థికి మూడు జతల యూనిఫాం, బూట్లు, సాక్సులు, స్కూల్ బ్యాగు, డిక్షనరీ తోపాటు తదితర వస్తువులను అందజేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రతి విద్యార్థికి ఈ జగనన్న విద్యా కానుక పథకం వర్తిస్తుందని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గించాలనే ఉద్దేశంతో ఈ జగనన్న విద్యా కానుక కిట్లను ఉచితంగా ప్రభుత్వం అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు విద్యలో రాణించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సుధాకర్

సమాధానం చెప్పలేకనే 'మేడా' వ్యక్తిగత విమర్శలు : టిడిపి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకనే రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి వ్యక్తిగత విమర్శలకు దిగారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, మండల అధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్య నాయుడు ఆరోపించారు. యువగళం పాదయాత్రలో మేడా, జడ్పీ చైర్మన్ ఆకేపాటి నియోజకవర్గానికి చేసిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ సిద్ధవటంలో కొన్ని వ్యాఖ్యలు చేశారని తెలిపారు. లోకేష్‌పై మేడా వ్యక్తిగత విమర్శలను ఖండిస్తూ మంగళవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జవాద్ తుఫాను సమయంలో వాతావరణ శాఖ వారం రోజులుగా హెచ్చరిస్తున్నా ఇసుక దోపిడీ కారణంగా ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, ప్రజలను అప్రమత్తం చేయక అన్నమయ్య డ్యామ్ తెగి జనన నష్టంతో పాటు పశు, ఆస్తి నష్టం సంభవించి నేటికీ రెండేళ్లు కావస్తున్నా మేడా, ఆకేపాటి స్పందించకపోవడం నిలువెత్తు నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. వైద్య కళాశాల మదనపల్లికి తరలిపోవడానికి మేడా చేతగానితనమే కారణమన్నారు. ఇసుక, మట్టి మాఫియాకు పాల్పడుతూ కొన్ని వేల ఎకరాల భూకబ్జాలకు పాల్పడి ఆలయానికి ఇచ్చామని గొప్పలు చెప్పుకోవడం సరికాదని తెలిపారు. తిన్నింటి వాసాలు లెక్క పెట్టే మేడా రాజంపేట నియోజకవర్గం కోల్పోయిన జిల్లా కేంద్రాన్ని, మెడికల్ కళాశాలను తీసుకువచ్చి వరద బాధితులకు సత్వర న్యాయం చేసి నిరూపించుకోవాలన్నిరు. సమావేశంలో పార్లమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండా శ్రీనివాసులు, మైనారిటీ నాయకులు అబూబకర్ పాల్గొన్నారు.

పేదలపై విద్యుత్ ఛార్జీల భారం

రాజంపేట అర్బన్: జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు కరెంటు బిల్లు పట్టుకుంటే షాక్ కొడుతోందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పూల భాస్కర్ అన్నారు. మంగళవారం ఆయన కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక బాదుడే బాదుడు అంటూ నాలుగేళ్లలో ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి వినియోగదారుల పైన రూ 17,723 కోట్ల అదనపు భారం మోకారని పేర్కొన్నారు. పెరిగిన విద్యుత్ ఛార్జీలతో ప్రజలు, రైతులు అవస్థలు పడుతుంటే సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.11,270 కోట్లు అదనపు భారం మోపనున్నారని తెలిపారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తే రూ.6888 కోట్లు, డొమెస్టిక్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే రూ.13 వేల కోట్లు అదనపు భారం పడుతుందని పేర్కొన్నారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించకపోతే రివర్స్ షాక్ తప్పదని, ప్రజలు ఫ్యాన్ తిరగకుండా చేస్తారని హెచ్చరించారు.

లోకేష్‌ను విమర్శించే స్థాయి అవినాష్‌రెడ్డికి లేదు

- టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి

కడప అర్బన్ : హత్య కేసులో నిందితుడిగా ఉన్న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను విమర్శించే స్థాయి లేదని ఆ పార్టీ టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం గాయత్రీ టవర్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో యువ గళం ఒక అపూర్వ ఘట్టమన్నారు. జమ్మలమడుగు నుంచి బద్వేల్ వరకు సాగిన యాత్రలో ప్రతి చోటా చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకున్నారని పేర్కొన్నారు. రాయలసీమ మూడు జిల్లాలతో పోలిస్తే కడప జిల్లాలో ప్రజలు బ్రహ్మ రథం పెట్టారని చెప్పారు. పలు కేసుల్లో కీలకంగా ఉన్న సీఎం జగన్ వారసత్వాన్ని అవి నాష్‌రెడ్డి పునికి పుచ్చుకున్నారని తెలిపారు. హత్య కేసులో సమాధానం చెప్పలేని ఎంపీ ఎలా ఆరోపణలు చేస్తున్నారని ప్రశ్నించారు. పాదయాత్రలో జనం స్పందన గొప్పగా ఉందని చెప్పారు.

హజ్ యాత్ర పవిత్రమైంది

కడప అర్బన్: ముస్లిములకు హజ్ యాత్ర ఎంతో పవిత్రమైందని డిప్యూటీ సిఎం అన్నారు. మంగళవారం హోటల్ షాహి బ్యాంకెట్ హాల్‌లో కౌమి టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ సయ్యద్ హష్మతుల్లా ఆధ్వర్యంలో హజ్ యాత్ర వెళ్లే వారికి అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ పవిత్రమైన హజ్ యాత్ర చేస్తున్న ప్రతి ఒక్కరూ ఎంతో అదృష్టవంతులని తెలిపారు. కౌమి టూర్స్ అండ్ ట్రావెల్స్ చేస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ షేక్.ఇషాక్ అలీ, రాయచోటి, చిన్న మస్జిద్‌కు చెందిన ఇమామ్‌ఒ ఖతీబ్ మౌలానా మౌల్వి షేక్.రషీద్ అహ్మద్, కౌమి ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సయ్యద్ హిదాయతుల్లా పాల్గొన్నారు.

ఎఐఎస్ఎ రాయచోటి ఏరియా నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పట్టణంలోని ఎఐఎస్ఎ కార్యాలయంలో మంగళవారం ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ రాయచోటి ఏరియా ముఖ్య నాయకుల సమావేశం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల లవకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి ఏరియా అధ్యక్ష కార్యదర్శులుగా టి.సతీష్ కుమార్,షేక్ సమీర్, ఉపాధ్యక్షులుగా సికిందర్, సహాయ కార్యదర్శిగా సునీల్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎఐఎస్ఎ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల లవకుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడూ ఎండగడుతూ పాలక ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ నిర్విరామంగా పోరాటాల ద్వారా విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. నూతనంగా ఏర్పడ్డ అన్నమయ్య జిల్లాలో విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తూ భవిష్యత్తులో జిల్లాలో సంఘాన్ని మరింత ముందుకు తీసుకు వెళ్ళడానికి కృషి చేస్తామన్నారు. అనంతరం రాయచోటి ఏరియా కమిటీగా నూతనంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ తమ్ముల్ని నమ్మకంతో అవకాశం కల్పించిన జిల్లా నాయకత్వానికి పత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థుల సమస్యల పట్ల ఎప్పటికప్పుడూ స్పందిస్తూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

బహుజన రాజ్యాధికార సభ ప్రచార రథం ప్రారంభం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఈ నెల 19వ తేదీ మదనపల్లి మిషన్ కాంపౌండ్‌లో జరగబోవు బహుజన రాజ్యాధికార సభకు సంబంధించిన ప్రచార రథాలు బిఎస్‌పి రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతం కుమార్ మరియు బిఎస్‌పి సీనియర్ నాయకులు ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భేగా నాయకులు మాట్లాడుతూ బహుజన రాజ్యాధికార సభకు బిఎస్‌పి రాజ్యసభ సభ్యులు రాంజీ గౌతమ్, డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఐపిఎస్, బి.పరంజ్యోతి, బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు విచ్చేస్తున్నారని తెలిపారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కేవలం కొన్ని వర్గాల చేతుల్లోనే అధికారం పెట్టుకుని బహుజన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అధికారం అందనీయకుండా కేవలం పెత్తందార్లు మాత్రమే పెత్తనం చేస్తున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలను ఓట్లగా మాత్రమే చూసే ఈ మనువాద దోపిడీ రాజకీయ పార్టీలు లాగా కాకుండా బహుజనులను రాజ్యాధికారంలో భాగస్వామ్యం చేసే పార్టీ ఈ దేశంలో బహుజన సమాజ్ పార్టీ ఒక్కటే అని తెలిపారు. కనుక బహుజన ప్రజలంతా ఈ మనువాద అగ్రకుల దోపిడీ రాజకీయ పార్టీలు ఎదుర్కొని బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో జరగబోవు బహుజన రాజ్యాధికార సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిఎస్‌పి సీనియర్ నాయకులు రెడ్డప్ప, బురుజు లక్ష్మీనారాయణ, సహదేవ, రమణ శ్యామ్, బాలాజీ పాల్గొన్నారు.

ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

చుక్కల భూముల చిక్కులకు శాశ్వత పరిష్కారం

కడప: దశాబ్దాల నాటి చుక్కల భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ రాష్ట్ర ప్రభుత్వం హక్కుదారులకు స్వేచ్ఛయుత సంపూర్ణ భూ హక్కును కల్పించడం అభినందనీయమని. ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం కడప ఆర్‌డిఒ కార్యాలయంలో చుక్కల భూములకు సంబంధించిన పరిష్కార కార్యక్రమంలో కడప నియోజకవర్గ పరిధిలోని చిన్నచౌకు, పాలంపల్లె, గూడూరు, చెమ్ము మియాపేట ప్రాంతాలకు చెందిన 45 మంది రైతులకు చెందిన 28.12 ఎకరాలపై వారికి సర్వే హక్కులు కల్పిస్తూ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చుక్కల భూములకు సంబంధించి నిబంధనలను సవరిస్తూ తీసుకువచ్చిన జీవో 152 ప్రకారం వైఎస్ఆర్ జిల్లాలో 17,553 సర్వే నెంబర్లలో చుక్కల భూములుగా గుర్తింపబడిన 31,399 ఎకరాల విస్తీర్ణంలో 15, 355 మంది రైతులకు 926.43 ఎకరాల భూమిపై సర్వ హక్కులు అందాయన్నారు. ప్రభుత్వంలో ఈ చుక్కల భూముల సమస్య హక్కుదారులైన రైతులకు ఎన్నో ఇబ్బందులను తెచ్చిందని చెప్పారు. కడప రెవెన్యూ డివిజన్ పరిధిలో మొత్తం 2,283 సర్వే నంబర్లలో గుర్తించిన 5,489 ఎకరాల చుక్కల భూములకు సంబంధించిన 2,878 మంది రైతులకు 166.20 ఎకరాలపై సర్వా హక్కులు కల్పిస్తామని ఆర్‌డిఒ ధర్మచంద్రారెడ్డి తెలిపారు. రైతులకు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించాలనే ఉద్దేశంతో చిక్కులు తొలగించామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యాన సలహాదారులు పి.శివప్రసాద్ రెడ్డి, కడప ఆర్‌డిఒ ధర్మచంద్రారెడ్డి, తహశీల్దార్ శివరామిరెడ్డి హాజరయ్యారు.

ఎంఆర్‌పిఎస్ జిల్లా కన్వీనర్ల నియామకం

రాయచోటి: ఎంఆర్‌పిఎస్ జిల్లా కన్వీనర్ కో-కన్వీనర్‌గా ఎ.శ్రీనివాసులు, ఎ.అశోక్ కుమార్‌ను నియమించారు. ఇటీవల పట్టణంలోని ఎన్‌జిఒ హోమ్‌లో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఉసురుపారి బ్రహ్మయ్య, రాష్ట్ర కో-కన్వీనర్ ఎస్.రామాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతి అభ్యున్నతి కోసం తమపై నమ్మకం ఉంచి కన్వీనర్లుగా ఎన్నుకున్న నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. బాధ్య తాయుతంగా జాతి కోసం అంకితభావంతో పని చేస్తామని చెప్పారు. వర్గీకరణ సాధించేవరకు అహర్నిశలు పోరాడుతామన్నారు. జులై 7న విజయవాడ జింఖానా గ్రౌండ్స్ లో ఎస్సీ వర్గీకరణ లక్ష్యసాధన కోసం జరుగు జనజాగృతి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎంవిఐకు వినతి పత్రం సమర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట, రైల్వేకోడూరులలో రవాణా నిబంధనలు ఉల్లంఘిస్తూ ఫిట్నెస్ లేకుండా స్కూల్ బస్సులు నడుపుతున్న భాష్యం, శ్రీ సాయి విద్యాలయ, నారాయణ పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమణ డిమాండ్ చేశారు. మంగళవారం రవాణా కార్యాలయంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ పట్టణంలోని శ్రీసాయి విద్యాలయ పాఠశాల యాజమాన్యం పేరుతో ఒక్కొక్క విద్యార్థి నుండి వేలకు వేలు డబ్బులు వసూలు చేస్తూ పరిమితికి మించి విద్యార్థులను బస్సులలో తరలిస్తున్నారని విమర్శించారు. ప్రశ్నించిన తల్లిదండ్రులపై యాజమాన్యం అండతో బస్సు డ్రైవర్లు దురుసుగా ప్రవర్తిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. బస్సులను అతివేగంగా నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. నిర్లక్ష్యంగా బస్సులు నడుపుతూ, పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తూ కనీసం సరియైన ఫిట్నెస్ కూడా లేని బస్సులను వినియోగిస్తున్న సంబంధిత పాఠశాలల పైన వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా రవాణా అధికారి కార్యాలయం వద్ద ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి మనోజ్, నాయకులు ఇస్మాయిల్, వెంకట్ పాల్గొన్నారు.

చెత్త సంపదే పంచాయతీకి ఆదాయ వనరులు : డిపిఒ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

జిల్లాలో చెత్త సంపదను పెంచితేనే పంచాయతీలకు ఆదాయ వనరులు సమకూరుతాయని జిల్లా పంచాయతీ అధికారి (డిపిఒ) ధనలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని విఠలం పంచాయతీలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీల్లో పొడి చెత్త, తడి చెత్తను వేరు చేసి వాటిని సంపద కేంద్రాలకు తరలించి, సంపదను సృష్టించాలని సూచించారు. పంచాయతీలో చెత్త సంపద ఎంత పెరిగితే పంచాయతీలకు అంత ఆదాయాలు వస్తాయన్నారు. ప్రతి ఒక్క పంచాయతీ కార్యదర్శి చెత్త సంపదపై దృష్టి సారించాలన్నారు. రోడ్లపైన, ఇళ్లలో ఉండే చెత్తను సేకరించి, సందప కేంద్రాలకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్వేత, పంచాయతీ కార్యదర్శులు రజిత, బయారెడ్డి పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిపిఒ ధనలక్ష్మి

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు

- ఎపిఎస్‌పిడిసిఎల్ అధికారుల సమీక్షలో సిఎండి కె.సంతోషరావు

సమావేశంలో మాట్లాడుతున్న సిఎండి సంతోషరావు

ప్రజాశక్తి-పీలేరు

వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయానికి అవకాశం ఇవ్వకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని ఎపిఎస్‌పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఎంఎన్ఆర్ గార్డెన్స్‌లో ఎపిఎస్‌పిడిసిఎల్ పీలేరు డివిజన్ స్థాయి అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రైతులకు పగటిపూట నిరంతరాయంగా తొమ్మిది గంటల పాటు విద్యుత్ సరఫరా అందించాలని ఆదేశించారు. అగ్రికల్చర్ సర్వీసు కోసం దరఖాస్తు చేసుకున్న 20 రోజుల్లోగా మంజూరు చేయాలని పేర్కొన్నారు. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ మరమ్మతులను వెంటనే చేపట్టాలని తెలిపారు. కాలిపోయిన ట్రాన్స్ ఫార్మర్లను వెంటనే మార్చు చెయ్యాలని సూచించారు. విద్యుత్తు కోతలు లేవని, కొత్త ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటు చేయాలని చెప్పారు. లోవోల్టేజీ సమస్య లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సబ్ స్టేషన్ మరమ్మతుల విషయంలో, 11 కెవి లైన్ల మార్గంలోని చెట్ల కొమ్మల తొలగింపు సమయాల్లో మాత్రమే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండాలని మిగిలిన సమయాల్లో ఆ సమస్య తలెత్తకుండా చూడాలని సిఎండి అధికారులను ఆదేశించారు. సమావేశంలో సిజియం గురవయ్య, ఓఎస్‌డి శ్రీనివాసులు, ఎస్ఇ ఎం.కృష్ణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మునిచంద్ర, డిఇఇలు, ఎఇలు, సిబ్బంది పాల్గన్నారు.

రైతులకు సూచనలు ఇస్తున్న ఉద్యానవన శాఖ అధికారి నాగమణి

ముదురు మామిడిలో కత్తిరింపులు చేపట్టాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ముదురు మామిడి తోటల్లో గాలి, వెలుతురు పడేటట్టు కొమ్మలు కత్తిరింపులు చేసుకుంటే వచ్చే ఏడాదికి రైతులు మంచి నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని లక్కిరెడ్డిపల్లె ఉద్యానశాఖ అధికారిణి. నాగమణి పేర్కొన్నారు. మండలంలోని కోనంపేట, బి.య(ర్రగుడి, దప్పేపల్లి గ్రామాల రైతులకు మామిడి పంటలో కాయలు కోత తర్వాత ఆచరించవలసిన సస్యరక్షణ, సమగ్ర యాజమాన్య పద్ధతులపై మంగళవారం రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి లో కాయలు కోసినప్పటి నుంచి తగు జాగ్రత్తలను పాటించినప్పటికీ నాణ్యతతో కూడిన మంచి దిగుబడులు పొందవచ్చని సూచించారు. కాయలు కోసిన తర్వాత 15 నుంచి 20 రోజులు చెట్టకు విశ్రాంతి నిచ్చిన తర్వాత కొమ్మ కత్తిరింపులు చేపట్టాలని సూచించారు. గుబురుగా పెరిగిన చెట్లలో సూర్య రశ్మి, గాలి లోపలికి ప్రస రించేలా తలపైన కొమ్మలను తూర్పు, పడమర దిక్కుల్లో మాత్రమే కత్తిరించి కొమ్మలు ఉన్న ఎండుపుల్ల, చీడపీడలు ఆశిం చిన కొమ్మలు, తొడిమ కొమ్మలను కత్తిరించి తొలగించాలని సూచించారు. కత్తిరింపులు చేసిన వెంటనే కోసిన కొమ్మ భాగానికి, చెట్టు పూర్తిగా తడిచేల మూడు గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని వివరించారు. తొలకరి వర్షాలు పడటానికి వాలుకు అడ్డంగా దుక్కులు దున్నా లన్నారు. పది సంవత్సరాలు పైబడిన చెట్టకు వర్షాధార తోటల్లో ప్రతి చెట్టుకు రెండు కిలోల యూరియా, ఐదు కిలోల సూపర్ ఫాస్పేట్ 1.5 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలన్నారు. జులై, ఆగస్టులో పచ్చిరొట్ట పైర్లయిన జనుము, జీలుగ, పెసర, అలసంద, ఉలవలు, పిల్లిపెసర లాంటి పంటలు వేసి పూత దశలో కలియ దున్నాలని సూచించారు. జింక్, బోరాన్ ధాతువుల లోపాలను నివారించడానికి 5 గ్రాముల జింక్ సల్ఫేట్, 2 గ్రాముల బోరాన్ లీటరు నీటికి లేదా ఫార్ములా-4 పొడిని లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున కలిపి 15 రోజుల వ్యవధిలో 2 నుంచి 3 సార్లు పిచికారి చేయాలని వివరించారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర సిబ్బంది హరిత, హసీనా, అనూష, వెంగయ్య, రైతులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను సన్మానించిన ఎంపిపి

ప్రజాశక్తి-కలకడ

తహశీల్దార్‌ను సన్మానిస్తున్న ఎంపిపి

మండల కేంద్రమైన కలకడ నూతన తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రదీప్‌ను ఎంపిపి శ్రీదేవి రవికుమార్ ఘనంగా సన్మానించారు. గతం లో ఇక్కడ పనిచేస్తున్న తహ శీల్దార్ బదిలీపై పెద్ద మండెం మండలానికి బదిలీ కావడంతో ఆస్థానములో పీలేరు నుంచి బదిలీపై కలకడ తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రదీప్‌ను దుశ్శాలువాతో సత్కరించారు. మండలంలో రైతులకు ఉన్న భూ వివాదాలను పరిష్కరించాలని తెలిపారు. ఇందుకోసం తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.

హుండీ ఆదాయం రూ.5 లక్షలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్ర సమీపంలోని మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో స్వామివారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకలను మంగళవారం లెక్కించారు. ఆలయ ఇన్స్పెక్టర్ రవి కిరణ్ కుమార్ రెడ్డి, ఈవో రమణ, చైర్మన్ కెఆర్.మల్‌రెడ్డి, సమక్షంలో హుండీ కానుకలను లెక్కించారు. రూ.5 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఇఒ తెలిపారు. మహాశివరాత్రి తర్వాత నుంచి ఇప్పటివరకు ఐదు నెలల కాలంలో ఈ ఆదాయం వచ్చిందన్నారు. ఈ ఆదాయాన్ని మల్లయ్య కొండ ఆలయ అభివృద్ధికి ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ధర్మకర్త ప్రభాకర్ రెడ్డి, కొండ కిట్ట పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి పడి బాలికకు గాయాలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

చెట్టు పైనుంచి పడి బాలిక తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం నిమ్మనపల్లి మండలంలో జరిగింది. బండ్లపై పంచాయతీ దుర్గంవారిపల్లెకు చెందిన డి.చంద్ర కుమార్తె డి.లిఖిత (9) తల్లిదండ్రులతో కలిసి పొలం వద్దకు వెళ్ళింది. తండ్రి టమోటా పంటకు మందు పిచికారి చేస్తుండగా అల్లనేరేడు కాయలు కోసేందుకు చెట్టుపైకి ఎక్కింది. కాయలు కోసే క్రమంలో చెట్టుకొమ్మ విరిగి బాలిక కింద పడింది. దీనితో చేయి విరిగి తీవ్ర గాయాలుపాలయ్యింది. తల్లిదండ్రులు వెంటనే నిమ్మనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఫీజును బట్టి విద్యాబోధన : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పట్టణంలోని కొన్ని ప్రయివేట్ పాఠశాలలు అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్‌కుమార్ తెలిపారు. ఎన్‌జిలో కార్యాలయంలో మంగళ వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని కొన్ని ప్రయివేట్ పాఠ శాలల్లో విద్యార్థులకు సంతలో కూరగాయల ధరల మాదిరిగా ఫీజు కట్టించుకొని, దానికి తగ్గట్టు బోధిస్తున్నారన్నారు. తక్కువ ఫీజు చెల్లించేవారిని, ఎక్కువ ఫీజు కట్టేవారిని సెక్షన్‌ల వారీగా విభజిస్తూ బోధిస్తున్నారన్నారు. స్కూల్ బస్సుల్లో తరగతులు వారీగా ఫీజులను పెంచుకుంటున్నారని తెలిపారు. ఇలా కొన్ని ప్రయివేట్ పాఠశాలలు ప్లే స్కూల్, ఐఐటి, స్పోకెన్ ఇంగ్లీష్ అంటూ తల్లిదండ్రులతో నమ్మబలిగిస్తూ అధికంగా ఫీజులు రాబడుతూ విద్యను వ్యాపారంగా చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నటువంటి పేద విద్యార్థులకు బడుగు బలహీన వర్గాలకు 25శాతం ఫీజును తగ్గించుకోవాలని చెబుతున్నా, ఎక్కడే గాని అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా విద్యాశాఖ ఉన్నత అధికారులు ఇలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజా, మస్తాన్, సుదర్శన్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే టిడిపి ధ్యేయం : 'నల్లారి'

ప్రజాశక్తి-కలికిరి

ఇంటింటికి నల్లారి కార్యక్రమంలో కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజా సంక్షేమమే టిడిపి ప్రధాన ధ్యేయమని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కలికిరి సచివాలయం-4 పరిధిలోని అంటే కురవపల్లి, పాలెకుల వారిపల్లి, రెడ్డివారిపల్లి, ఎల్లమ్మగుడి వరకు ఇంటింటికి నల్లారి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు విడుదల చేసిన మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. నెలనెలా మహిళలకు రూ.1500 రూపాయలు, ప్రతి కుటుంబానికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగులకు రూ.3వేలునిరుద్యోగ భృతి, రైతులకు సంవత్సరానికి రూ.20వేలు ఆర్థిక సాయం వంటి మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే టిడిపి అధికా రంలోకి రావాలని ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉన్నప్పుడే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని అంతేకాకుండా పీలేరు నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే టిడిపికి ఓటు వేసి అధిక మెజార్టీతో నల్లారి కిషోర్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి నల్లారి చంద్రారెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, ఉపాధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, మేజర్ పంచాయతీ సర్పంచ్ ప్రతాప్ కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గడ్డం అంజయ్య, మాజీ జడ్‌పిటిసి మాలతి, మాజీ ఎంపిటిసి జనార్దన్‌గౌడ్, పీలేరు నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు అగస్త్యేశ్వర్, నాయకులు శ్రీనివాస్ వర్మ, మోహన, తిప్పారెడ్డి పాల్గొన్నారు.

హైనాల దాడిలో 40 గొర్రెలు మృతి

మృతి చెందిన గొర్రెలను చూపుతున్న రైతు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

గొర్రెలమందపై హైనాలు దాడి చేయడంతో 40 గొర్రెలు మృతి చెందిన సంఘటన మండలంలోని బడికాయలపల్లిలో మంగళవారం వేకువజామున చోటుచేసుకుంది. ఈ సందర్భంగా బాధిత రైతు పసుపులేటి వెంకటరమణ మాట్లాడుతూ అర్ధరాత్రి ప్రాంతంలో తాను పోషించుకుంటున్న గొర్రెలను పాకలో ఉంచగా, సుమారు 40 గొర్రెలపై హైనాలు విచక్షణార హితంగా దాడి చేయడంతో మృతి చెందాయని తెలిపారు. ఉదయం 6 గంటల సమయంలో గమనించి వెంటనే సంబం ధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆయన కన్నీరు మున్నీరుగా విలపించాడు. సచివా లయ వెటర్నరీ అసిస్టెంట్ బాబా ఫక్రుద్దీన్ తెలుపగా ఉన్నతాధికారులు చెబితే తప్ప మేము ఎక్కడికి వచ్చేది లేదని దురుసుగా మాట్లాడారని ఆరోపించారు. సమయానికి పశు వైద్య అధికారులు స్పందించి ఉంటే కొన్ని గొర్రెలైనా బ్రతికేవని ఆవేదన వ్యక్తం చేశాడు. మృతి చెందిన గొర్రెల విలువ రెండున్నర లక్షల రూపాయలు ఉంటుందని, ప్రభుత్వం స్పందించి తమ కుటుంబాన్ని ఆదు కోవాలని రైతు వెంకటరమణ విజ్ఞప్తి చేశారు.

వెంకటరమణ కుటుంబాన్ని ఆదుకోవాలి : సిపిఎం

గొర్రె పాకపై హైనాలు దాడి చేయడంతో 40 గొర్రెలు మృతి చెంది నష్టపోయిన పెంపకందారు వెంకటరమణ కుటుంబాన్ని ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ బాబా ఫక్రుద్దీన్‌కు తెలిపినా పట్టించు కోక 'పోవడం బాధాకరమన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే లక్షల విలువ చేసే 40 గొర్రెలు చనిపోయి గొర్రెల పెంపకం దారుడైన రైతు వెంకట రమణ రోడ్డున పడ్డాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై స్థానిక ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తరుపున సాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సిపిఎం తరపున బాధితుడికి అండగా ఉంటామని తెలిపారు.

రక్తదానం చేయండి..ప్రాణ దాతలు కండి

ప్రజాశక్తి-రాయచోటి

సాల్ట్‌ఆర్ట్ ద్వారా శుభాకాంక్షలు తెలుపుతున్న సభ్యులు

రక్తదానం చేయండి మరో ప్రాణాన్ని కాపాడండని డిప్యూటీ డిఎంహెచ్‌ఒలు డాక్టర్ శైలజ, డాక్టర్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళ వారం డిఎంహెచ్ఒ కార్యాలయంలో వారు విలేక రులతో మాట్లాడుతూ బుధవారం ప్రపంచ రక్త దాన దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రాయచోటి బస్టాండ్ రోడ్ లోని డైట్ పాఠశాల ఆవరణంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశాంన్నారు. ఈ శిబిరంలో రాయచోటి పరిసర ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేసే సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మానవతా సేవా సంస్థ సభ్యులు ఆసక్తిగల విద్యార్థులు, ప్రజలు ఎవరైనా పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది 5 మంది లేదా కనీసం ముగ్గురు రక్తదానం చేయుటకు వైద్యాధికారులు ప్రోత్సహించాలని కోరారు. రక్తదానం చేయదలుచుకున్న వారు ఉదయం తొమ్మిది గంటలకు శిబిరం వద్దకు హాజరై పేర్లు నమోదు చేసుకోవాలని, రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలు అందజేస్తారని తెలిపారు. **బి.కొత్తకోట** మదనపల్లి లయన్స్ క్లబ్ ఆఫ్,హార్సీలీహిల్స్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రక్తదాన శిబిరాన్ని నిర్వ హించ నున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ హార్సీలీహిల్స్ సభ్యులు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ప్రపంచ రక్తదాతలు దినోత్సవం పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కాలేజ్ నందు రక్తదాత సుఖీభవ పేరిట రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని, రక్తదానం చేయదలచుకున్న వారు 9966655167 నంబర్‌ను సంప్రదిం చాలని కోరారు. **నందలూరు :** ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజంపేట ప్రభుత్వ వైద్యశాల నందు బుధవారం ఏర్పాటు చేస్తున్న రక్త దాన శిబిరం లో పలు పంచుకొని ఆరోగ్యవంతులైన యువతి యువకులు రక్తదా నం చేసి ప్రాణ దాతలు కావాలని మండల వైద్యాధి కారులు డాక్టర్ సృజన, డాక్టర్ చంద్ర శేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ మండలంలోని యువత బుధవారం ఉదయం 9.30 గంటలకు రాజంపేట ప్రభుత్వ వైద్యశాలకు అల్పాహారం తీసుకున్న తర్వాత రావాలని తెలిపారు. **మదనపల్లె అర్బన్:** ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని హెల్పింగ్ మైండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సాల్ట్‌ఆర్ట్ ద్వారా రక్తదాతలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబకర్ సిద్ధిక్ మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న గర్భిణులకు, ప్రమాదాల్లో గాయపడిన వారికి, తలసిమియా చిన్నారులకు దైవదూతలుగా రక్తదాతలు ఉన్నారని సాల్ట్ ఆర్ట్‌ను యోధ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ సతీష్ వారి సహకారంతో వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు కిరణ్, అమీన్,ఖాజా, సయ్యద్, దినకర్ పాల్గొన్నారు.

ఉదారత చాటుకున్న ఎంపీ

ప్రజాశక్తి - బి.కొత్తకోట

మండలం బీరంగి గ్రామం దిగువబజార్‌లో కాలేయ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి కీర్తి రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అండగా నిలిచారు. కీర్తి ఆరోగ్య పరిస్థితిని టీం ద్వారకనాథరెడ్డి సభ్యులు ద్వారా తెలుసుకున్న ఎంపీ స్పందించి ప్రత్యేకంగా పర్యవేక్షించి చికిత్స చేయిస్తున్నారు. బాలిక తండ్రి కొద్ది కాలం క్రితం మరణించగా పిల్లల పోషణ కోసం తల్లి గల్ఫ్ దేశాలకు వెళ్లారు. కీర్తి కురబలకోట కస్తూర్బా పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతోంది. అమ్మమ్మ, చిన్నాన్న అప్పు చేసి మరీ వైద్యం చేయించారు. వారు టీం ద్వారకనాథరెడ్డి సభ్యులని సంప్ర దించగా శంకర్ రామిగాని, లక్ష్మీపతిరెడ్డి ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన తక్షణ సాయంగా లక్ష రూపాయల సొంత నిధి ఇచ్చి బెంగళూరు అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. అంతేకాకుండా ప్రత్యేక చొరవతో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి రూ.35 లక్షలు కాలేయ మార్పిడి చికిత్స నిమిత్తం మంజూరు చేయించడానికి ముఖ్యమంత్రి కార్యాలయానికి సిఫార్సు చేశారు. టీం ద్వారకనాథరెడ్డి సభ్యులు చిన్నారి వైద్యానికి రూ.50 వేలు ఆర్థిక సాయం చేసి తమ ఉదారతను చాటుకున్నారు.

పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక తంబళ్ళపల్లి మండలంలోని కన్నెమడుగు, తంబళ్ళపల్లి, మోడల్ స్కూల్ ఉన్నత పాఠశాలలను డివైఇఒ క్రిష్ణప్ప సందర్శించారు. జగనన్న విద్యా కానుక పంపిణీని పరిశీలించి, ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించి ఈ విద్యా సంవత్సరం విజయవంతం చేయాలని, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజనాన్ని కూడా పరిశీలించి మెనూ ప్రకారం వండాలనీ సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ త్యాగరాజు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంప్రూమెంట్ ఫలితాల్లో 'ఎస్‌వి' విజయకేతనం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పి.సాయిచరణ్ కె.నికిత

ఇంటర్మీడియట్ ఇంప్రూవ్మెంట్ ఫలితాలలో ఎస్‌వి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌ఎన్. శ్రీనివా సులు తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపిసి ఇంగ్లీష్ మీడియంలో కె.నికిత 463/470 స్టేట్ ర్యాంక్, పి.సాయి చరణ్ 462 టౌన్‌ఫస్ట్‌గా నిలిచారని తెలిపారు. డైరెక్టర్ ఎస్.వసుంధర, అధ్యాపక అధ్యాపకేతర బృందం హర్షం వ్యక్తం చేశారు.

కాకతీయ విద్యా సంస్థల జయభేరి..

భబిత వజిదా

రాజంపేట అర్బన్ : ఇంటర్మీడియట్ ఫలితాలలో కాకతీయ విద్యా సంస్థలు జయభేరి మోగించాయని కరస్పాండెంట్ పోలా వెంకటరమణారెడ్డి, పోలా శ్రీనివాసులు రెడ్డి, పోలా వైభవ్‌రెడ్డిలు తెలియజేశారు. మంగళవారం సాయంత్రం విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో కాకతీయ విద్యా సంస్థల నుంచి సిఇసి విభాగం నందు ఎస్.వాజీదా 470 మార్కులతో పట్టణంలో ప్రథమ స్థానం సాధించడంతో పాటు ఎంపిసి విభాగంలో భవిత శివాని 447 మార్కులు, బైపిసి విభాగంలో ఆయేషా 407 మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించారని తెలిపారు. ఈ విజయానికి దోహదపడిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, కాకతీయ విద్యాసంస్థల తరపున అభినందనలు తెలిపారు.

వారాహి యాత్ర విజయవంతం కావాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రెడ్డిపల్లి చెరువుకట్ట వద్ద కలిసి ఉన్న శ్రీఅభయాంజనేయ స్వామి దగ్గర రైల్వేకోడూరు ఇన్‌ఛార్జి డాక్టర్ బోనాసి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారాహి యాత్ర కుబయో గోదావరి జిల్లాలో ప్రారంభమై రాష్ట్రంలోని అన్ని జిల్లాల నియోజకవర్గాల మీదుగా సాగుతుందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోనూ వివిధ వర్గాల ప్రతినిధులను కలసి వారితో చర్చించాలని జనసేన అధినేత నిర్ణయించారని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో జనవాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ ప్రెసిడెంట్ కరుణాకర్‌రాజు, వర్ధన్న గారి ప్రసాద్, రెడ్డి ప్రసాద్, దినకర బాబు, రామ్మూర్తి, అనంత రాయలు, ఆలం నాగభూషణం, సాయం శ్రీధర్, నగిరిపాటి మహేష్, అంకి శెట్టి మనీ, పసుపులేటి వెంకటరమణ, కొండేటి జంగయ్య, వెంకట రాయుడు, నల్లంశెట్టి కిషోర్, వెంకటేశ్వర్లు, భాస్కర పంతులు, బాలసాయికృష్ణ, ప్రశాంత్ పోలిశ టట్టి శ్రీనివాసులు, వీరయ్య ఆచారి, శంకరయ్య, అబ్బిగారిగోపాల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-చక్రాయపేట

మండలంలోని గండిక్షేత్రంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో నిత్య అన్నదాన పథకానికి పులివెందులకు చెందిన భవానీ శివశంకర్ సప్లయర్స్ అధినేత మణికంటేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులు మంగళవారం రూ.1,01,116 విరాళం ఇచ్చినట్లు ఎసి అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ పినుపోలు రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు.

విద్యార్థికి జెవికె కిట్‌ను అందిస్తున్న సర్పంచ్, ప్రధానోపాధ్యాయులు

విద్యా కానుకను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-నందలూరు

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న విద్యా కానుకల పంపిణీ కార్యక్రమాన్ని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో సర్పంచ్ మోడపోతుల రాము, ఉప సర్పంచ్ ఇబ్బులు ముఖ్య అతిథులుగా పాల్గొని జగనన్న విద్య కానుక కిట్టులను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న విద్యాకానుకను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సిఎం జగన్ పాలనలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే మార్చారని అన్నారు. ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకున్నాయని కొనియాడారు. ప్రతి ఒక్క విద్యార్థి ప్రత్యేక శ్రద్ధ వహించి చదివి గొప్పవారుగా ఎదగాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

సివిల్ ఇంజినీర్లకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్

'మిట్స్'లో సివిల్ ఇంజినీర్లకు అవగాహన

ప్రజాశక్తి-కురబలకోట

స్థానిక మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ విభాగం వారు మెటీరియల్ అండ్ క్వాలిటీ టెస్టింగ్‌పై జిల్లా లోని ప్రయివేట్ సివిల్ ఇంజినీర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో సుమారు 60 మంది ప్రయివేట్ సివిల్ ఇంజినీర్లు కళాశాలలోని సివిల్ విభాగానికి చెందిన అధునాతన కాంక్రీట్‌ల్యాబ్, సాయిల్‌ల్యాబ్, హైవేల్యాబ్, మోడల్ టెస్టింగ్ ల్యాబ్, తదితర ల్యాబ్‌ను సందర్శించి కళాశాలలో పనిచేస్తున్న ప్రొఫెసర్‌లచే సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ మాట్లాడుతూ తమ కలశాలలో అత్యాధునిక టెక్నాలజీతో ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న సివిల్ ఇంజనీరింగ్‌కు సంబంధిచిన బేరింగ్ కెపాసిటీ, సిమెంట్ నాణ్యత, రాళ్ళ సామర్థ్యం, ఇసుక నాణ్యత వంటి పరీక్షలను భారతీయ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా జరపబడునని తెలిపారు. ఇవి ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటాయని, కావాల్సిన వారు కళాశాలను సందర్శించవచ్చుని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ తులసీరామ్ నాయుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ జైస్వాల్, డాక్టర్ సుధీర్ పాల్గొన్నారు.

'సీమ'లో పాదయాత్ర దిగ్విజయం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మాట్లాడుతున్న పర్వీన్‌తాజ్

రాయలసీమ జిల్లాలలో టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర దిగ్విజయంగా జరిగిందని టిడిపి కార్యని ర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్ పేర్కొన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గం నుంచి పాదయాత్రకు శ్రీకారం చుట్టిన నారా లోకేష్ 124 రోజులు ఉమ్మడి రాయ లసీమ జిల్లాలో 52 నియోజక వర్గాలో పాదయాత్ర చేసి చరిత్ర సృష్టించారని అన్నారు. గతంలో ఎందరో పాదయాత్ర చేసినా ఏ నాయకుడు తిరగనన్నీ నియోజ కవర్గాల్లో పాదయాత్ర చేశారన్నారు. లోకేష్ పాదయాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. సమావేశంలో పట్టా చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

పేకాటస్థావరం పై దాడులు నిర్వహించి నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. సోమవారం ముష్టూరు పంచాయతీ దిగువపల్లెకు సమీపంలో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందిందన్నారు. ఆ మేరకు స్థానిక పోలీ సులు పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి నలుగురిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3500లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా : వ్యక్తి మృతి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మృతి చెందిన రమణ

ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ఆటో బోల్తా పడడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటనలో మండలంలో గండబోయనపల్లి సమీపంలోని దొడ్లడైరీ వద్ద చోటు చేసుకొంది. వివరాలు.. కెవిపల్లి మండలం సొరకాయలపేట పంచాయతీ మినిమి రెడ్డిగారి పల్లికి చెందిన రమణ (48)ఎర్రగడ్డలు, తెల్లగడ్డల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఇదే ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ సంజీవ(36) ఆటోను బాడుగకు తీసుకొని మదనపల్లికి వెళ్లి ఎర్రగడ్డలు, తెల్లగడ్డలను తీసుకొని వస్తుండగా..మార్గమధ్యంలోని వాల్మీకిపురం మండలం గండబోయనపల్లి సమీపంలోని దొడ్లడైరీ వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వెనుక వైపు కుర్చొని ఉన్న రమణ కిందపడడంతో అతనిపై ఎర్రగడ్డలు, తెల్లగడ్డల మూటలు పడ్డాయి. దీంతో రమణ అక్కడికక్కడే మృతి చెందగా.. డ్రైవర్ సంజీవ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. రమణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వాల్మీకిపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్ఐలు నాగేశ్వర రావు, క్రిష్ణమూర్తి సంఘటనాస్థలానికి చేరుకొని, ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సులో నుంచి పడి కండక్టర్..

మృతి చెందిన కండక్టర్

మదనపల్లె అర్బన్ : బస్సులో నుంచి ప్రమాదవశాత్తు కిందపడి కండక్టర్ మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ వెంకటేష్ కథనం మేరకు..వాయల్పాడుకు చెందిన పి. జాఫర్ ఖాన్(75) ఎస్‌విఎంఎస్ బస్సు కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం మదనపల్లె నుంచి చింతామణి వెళుతున్న బస్సు చిప్పిలి స్పీడ్‌బ్రేకర్ వద్ద సడన్‌గా బ్రేక్ వేయడంతో టికెట్ కొడుతున్న కండక్టర్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు తెలిపారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE - PILER.
I.P.No. 9/2021

Sri G.Nagaiah. ...Plaintiff
Sri A.Madhu and Others. ...Defendant

NOTICE TO RESPONDENT NOs. 1,3,4 AND 5.

R1. Sri Andala Madhu, S/o Reddeppa, Kataruvandlapalli, H/o Matampalli Revenue Village, Kambhamvaripalli Mandal, Annamayya District.
R3. Sri Thummala Hari, S/o Mallaiah, Kataruvandlapalli, H/o Matampalli Revenue Village, Kambhamvaripalli Mandal, Annamayya District.
R4. Sri Thummala Reddeppa, S/o Siddappa, Kataruvandlapalli, H/o Matampalli Revenue Village, Kambhamvaripalli Mandal, Annamayya District.
R5. Sri Badepalli Reddeppa Reddy, S/o Nagi Reddy, Badepalli, H/o Madithedu Revenue Village, Sundupalli Mandal, YSR Kadapa District.

Sirs,

Please take notice that the above petitioner filed the above insolvency petition No.9/2021 on the file of the above court against all of you for declaring the petitioner as an insolvent as the petitioner is unable to discharge his debts payable to you and other respondents. The above case is posted to 16-06-2023 at 10.30 A.M. for your appearance before the above Court either in person or through an advocate and file your objections if any. Otherwise the matter will be decided ex-parte.

//By Order of the Court//
G.SIVA KUMAR REDDY
Advocate for petitioner,
PILER- 517 214,
Mobile No.9951896569.

CHANGE OF NAME

I Kumpati Palvi (old name) D/o Kumpati Sivakumar reddy(old name) r/o D.No 3/43-B , Venkatareddypalli,Upparapalli,Rly koduru mandal, Annamaiah Dt, A.P. Have been changed my name as Kumpati Pallavi (New name) D/o Kumpati Siva Kumar Reddy (New name).

పాస్‌పోర్ట్ పోయినది

అన్నమయ్య జిల్లా నందలూరు మండలం టంగుటూరు గ్రామ పంచాయతీ డోర్ నెం: 3/38 టంగుటూరులో నివాసం ఉంటున్న దివంగత కొమ్మూరు ఇస్మాయిల్ సాహెబ్ గారి కుమారుడు కొమ్మూరు మస్తాన్‌వల్లికి చెందిన పాస్ పోర్ట్ ఈనెల మూడవ తేదీ న నందలూరు బస్టాండ్ లో నాకు చెందిన ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెంబర్ **V9885752** పోయినది. ఎవరికైనా దొరికినచో పై చిరునామాకు గాని 9000636250 మొబైల్ నెంబర్‌కు గాని తెలుపగలరు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE - PILER.
I.P.No. 4/2020

Sri Chamanchula Venkatesu. ...Plaintiff
Sri Y.Surendra and others. ...Defendant

NOTICE TO RESPONDENTS NOs. 19 AND 21.

R19) Smt Vaddipalli Jayamma, W/o Ramappa, Vaddipalli, Devapatla, YSR Kadapa District.
R21) Smt.S.Faathima, W/o Late Mahaboob Saheb, Beside Ramulugudi, Peddamandyam, YSR Kadapa District.

Madams,

Please take notice that the above petitioner filed the above insolvency petition No.4/2020 against you and other respondents for declaring the petitioner as an insolvent as the petitioner is unable to discharge his debts payable to you and the other respondents. The above case is posted to 04-07-2023 at 10.30 A.M. for your appearance before the above Court either in person or through an advocate and file your objections if any. Otherwise the matter will be decided ex-parte.

//By Order of the Court//
G.SIVA KUMAR REDDY
Advocate for petitioner,
PILER- 517 214,
Mobile No.9951896569.